క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని వినతి


ఈఎన్సీకి పుష్పగుచ్ఛమిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఆర్ అండ్ బీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి అసోసియేట్ చైర్మన్ శరత్‌బాబు కోరారు. ఈ మేరకు జిల్లా పర్యటనకు విచ్చేసిన ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ శేషుకుమార్‌ను దర్గామిట్టలోని ఆ శాఖ ఎస్ఈ కార్యాలయంలో అసోసియేషన్ నేతలు బుధవారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం శరత్ బాబు మాట్లాడారు. జిల్లా విభజన సమయంలో ఆర్ అండ్ బీ శాఖలోని నెల్లూరు సర్కిల్ నుంచి 17 మంది ఉద్యోగులను తిరుపతికి బదిలీ చేశారని, ఇందులో దివ్యాంగురాలూ ఉన్నారని చెప్పారు. దీంతో ఇక్కడ సిబ్బంది లేకుండాపోయారని, ఉన్న వారితో పనులు కావడంలేదని తెలిపారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.

నర్సుల రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు(అర్బన్): ట్రియిన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర స్థాయి ఎన్నికలను దర్గామిట్టలోని ఓ ఫంక్షన్ హాల్లో బుధవారం నిర్వహించారు. టీఎన్ఏఐ ఏపీ ప్రెసిడెంట్‌గా శ్రీకాకుళం ప్రభుత్వ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉషా, వైస్ ప్రెసిడెంట్‌గా నెల్లూరు నారాయణ నర్సింగ్ కళాశాలకు చెందిన ప్రిన్సిపల్ వనజకుమారి, జాయింట్ సెక్రటరీగా ఏలూరు సీఆర్ రెడ్డి నర్సింగ్ కళాశాలకు చెందిన ప్రిన్సిపల్ అరుణకుమారిని ఎన్నుకున్నారు. 670 మందికి గానూ 661 మంది ఓటేశారు. సంఘ జాతీయ స్థాయి ప్రెసిడెంట్ అన్నెకుమార్, సౌత్ రీజియన్‌కు చెందిన జాతీయ స్థాయి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వలీ, డిప్యూటీ సెక్రటరీ జనరల్ సంఘమిత్ర సావంత్, ఇప్పటి వరకు ఏపీ ప్రెసిడెంట్‌గా వ్యవహరించిన షంషీర్‌బేగం, సెల్వమ్మ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విశేష పూజలను నిర్వహించారు. ఉభయకర్తలుగా గోపాలకృష్ణ, అంజని, మద్దిన విశ్వనాథం, బృంద దంపతులు వ్యవహరించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

వెన్నెముక సమస్యలపై అవగాహన తప్పనిసరి

నెల్లూరు(అర్బన్): వెన్నెముక సమస్యలపై ప్రజలు అవగాహన పెంచుకొని తగు జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వ సర్వజనాస్పత్రి న్యూరోసర్జన్ ధీరజ్ పేర్కొన్నారు. ప్రపంచ వెన్నెముక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆస్పత్రిలో బుధవారం ఆయన మాట్లాడారు. డాక్టర్ల సూచనలు పాటిస్తూ అవసరమైన పౌష్టికాహారాన్ని తీసుకోవడం, తగిన విశ్రాంతి ద్వారా వెన్నెముక సమస్యలను అధిగమించొచ్చని వివరించారు.

అనుమతుల్లేకుండా విక్రయిస్తే చర్యలు

నెల్లూరు(క్రైమ్): దీపావళి నేపథ్యంలో అనుమతుల్లేకుండా బాణసంచాను విక్రయిస్తే చర్యలు తప్పవని నవాబుపేట ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. లైసెన్స్‌లు కలిగిన వారు నిర్దేశిత ప్రాంతంలోనే బాణసంచా విక్రయ దుకాణాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనుమతుల మేరకే నిల్వలుంచుకోవాలని, దుకాణాల వద్ద సురక్షిత పద్ధతులను పాటించాలని కోరారు. బాణసంచాను అక్రమంగా విక్రయిస్తున్నా, నిల్వ ఉంచినా డయల్ 112 లేదా 94407 96306 నంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.

మహిళ మెడలో సరుడు చోరీ

నెల్లూరు(క్రైమ్): భర్తతో కలిసి స్కూటీపై వెళ్తున్న మహిళ మెడలోని బంగారు సరుడును గుర్తుతెలియని దుండగులు తెంపుకెళ్లారు. పోలీసుల సమాచారం మేరకు.. మాగుంట లేఅవుట్లోని ఓ అపార్ట్‌మెంట్‌లో విశ్రాంత ఉద్యోగి చక్రపాణి, జయమైథిలీ దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో సప్తగిరి కాలనీ సమీపంలోని ఓ ట్రాక్టర్ షోరూమ్ వద్దకు స్కూటీపై వచ్చేసరికి ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు సరుడును తెంపుకెళ్లారు. బాధితులు కేకలేయడంతో స్థానికులు అప్రమత్తమై.. దుండగులను పట్టుకునేందుకు యత్నించగా వారు బైక్ వేగాన్ని పెంచి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లిఫ్ట్ పనిచేసేదెప్పటికో..?

- వృద్ధులు, దివ్యాంగులకు ఇక్కట్లు
- కార్పొరేషన్ కార్యాలయంలో ఇదీ దుస్థితి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలోని లిఫ్ట్ పనిచేయడంలేదు. ఈ భవనంలోని నాలుగంతస్తుల్లో పలు విభాగాలున్నాయి. వందల సంఖ్యలో ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తుంటారు. వివిధ పనుల నిమిత్తం ఇక్కడికి నిత్యం ఎంతో మంది వస్తుంటారు. ఈ తరుణంలో వీరి సౌకర్యార్థం రెండు లిఫ్ట్‌లను ఏర్పాటు చేశారు. అయితే మేయర్ చాంబర్ ముందున్న లిఫ్ట్ రెండు నెలలుగా పనిచేయడంలేదు. దీంతో మరొకటే పనిచేస్తోంది. ఈ తరుణంలో ఇది ఒక్కసారి పైకెళ్లి కిందికి రావాలంటే చాలా సమయం పడుతోంది. ఫలితంగా నిరీక్షణ తప్పడంలేదు. వృద్ధులు, దివ్యాంగుల అగచాట్లు వర్ణనాతీతమవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి దీన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



మరమ్మతులకు గురైన లిఫ్ట్



వినియోగంలో ఉన్న మరో లిఫ్ట్ వద్ద నిరీక్షణ

కాలువలో పడిన ద్విచక్రవాహనదారుడు

- సమస్యపై 'సాక్షి'లో కథనం ప్రచురితం
- అయినా స్పందించని అధికారులు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురం సెంటర్‌లో రోడ్డు వెడల్పు చేసిన ప్రాంతంలో కాలువ నిర్మాణం కోసం 20 అడుగుల మేర లోతులో తవ్విన గుంతలో ఓ ద్విచక్రవాహనదారుడు బుధవారం పడ్డారు. ఇక్కడ ఎలాంటి సూచిక బోర్డులు.. బ్యారికేడ్లను ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయనే అంశమై 'ఆదమరిస్తే అంతే' అనే శీర్షికన సాక్షిలో కథనం బుధవారం ప్రచురితమైంది. అయినా అధికారుల నుంచి స్పందన కరువైంది. ఈ నేపథ్యంలో నెల్లూరువైపు బైక్ ఓ ద్విచక్రవాహనదారుడు బుధవారం మధ్యాహ్నం వెళ్తూ అదుపుతప్పి గుంతలో పడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న 108లో క్షతగాత్రుడ్ని ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ భవన్ వద్ద ధర్నా రేపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ భవన్ వద్ద ధర్నాను ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టనున్నామని కమిటీ నేత సుమన్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేయాలనే అంశమై విజయవాడలోని విద్యుత్‌సౌధలో జేఏసీ నేతలు అదే రోజున చర్చలు జరపనున్నారని, వీరికి సంఘీభావంగా ధర్నాను చేపట్టనున్నామని వివరించారు. భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. యూటీఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు, నేతలు హజరత్తయ్య, జాకీర్‌హుస్సేన్, నాగయ్య, పెంచలప్రసాద్, హరినారాయణ, మహేష్, రాజమోహన్, సునీల్, భాస్కర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నేతలు

ఇంతలోనే ఎంత మార్పు..!

- మొన్న రుసరుస.. నేడు బుజ్జగింపు ధోరణి
- కోటంరెడ్డి తీరుపై టీడీపీలో విస్మయం

నెల్లూరు సిటీ: పట్టుబడిన ఐదు లారీల్లో రెండింట్లోనే అక్రమ బియ్యం ఉందని అధికారులు తేల్చారని.. కొందరు రింగ్‌గా ఏర్పడి అక్రమంగా రవాణా చేస్తున్నారని.. జనసేనకు చెందిన మంత్రి నాదెండ్ల మనోహర్‌తో విచారణ చేయించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఈ నెల 11న డిమాండ్ చేసిన టీడీపీ నేత, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తన స్వరం మార్చారు. అక్రమ రవాణా సూత్రధారులను పట్టుకోకపోతే తానే రంగంలోకి దిగుతానని హెచ్చరిక ధోరణితో మాట్లాడిన ఆయన తాజాగా క్షమాపణ చెప్పే వైఖరిని అవలంబించారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ తీరును ఆయన అనుసరించారు. తన వ్యాఖ్యలు ఎవర్నీ ఉద్దేశించినవి కావంటూ వివరణ ఇచ్చారు. పట్టుబడిన లారీలతో జనసేన నేతలు, కార్యకర్తలకు సంబంధంలేదంటూ ముక్తాయింపునిచ్చారు. తమ మాటలతో మంత్రి నాదెండ్ల మనస్తాపం చెంది ఉంటే విచారణ వ్యక్తం చేస్తున్నానని సెలవిచ్చారు. బీరాలు పలికి చివరికి సమావేశాన్ని ఇలా నిర్వహించడంపై ఆ పార్టీ వర్గాల్లోనే విస్మయం వ్యక్తమవుతోంది.

ఘనంగా అబ్దుల్ కలామ్ జయంతి

నెల్లూరు(పొగతోట): మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ జయంతిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. పార్టీ విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్‌రెడ్డి, నగర నియోజకవర్గ అధ్యక్షుడు తౌఫిక్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బాలాజీనగర్‌లోని ఆవాజ్ కార్యాలయంలో అబ్దుల్ కలామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్, నేతలు రియాజ్, రవూఫ్, షాహుల్, ఫయాజ్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

- 54వ డివిజన్లోని టిడ్కో గృహ సముదాయంలో కలామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. దివ్యాంగుల ఐక్య సంఘ జిల్లా అధ్యక్షుడు సనావుల్లా, బ్లాక్‌బోర్డు మిత్రమండలి అధ్యక్షుడు ప్రసాద్, గుమ్మడి శీనయ్య, అలియా, రసూల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(అర్బన్): దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సేవలు స్ఫూర్తిదాయకమని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్పాస్టిక్స్ సెంటర్ కో ఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ ఎమ్మెస్సార్ స్పాస్టిక్స్ సెంటర్‌లో ఆయన జయంతిని నిర్వహించారు. రెడ్‌క్రాస్ సంస్థ సెక్రటరీ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగ ఆధ్వర్యంలో..



ఆవాజ్ ఆధ్వర్యంలో..


దుప్పట్ల పంపిణీ


రెడ్‌క్రాస్ స్పాస్టిక్స్ సెంటర్‌లో..

మహిళ అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): మహిళ అదృశ్యమైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. ఓ కేసులో బాధితురాలిగా ఉన్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన మహిళను మహిళా ప్రాంగణంలో గత నెల 29న దర్గామిట్ట పోలీసులు చేర్చారు. అప్పటి నుంచి అక్కడే ఉంటున్న ఆమె అందరితో కలిసి టిఫిన్ చేశారు. చేతులు శుభ్రం చేసుకొస్తానని చెప్పి వెళ్లిన ఆమె ఎంతసేపటికీ తిరిగి రాలేదు. దీంతో విషయాన్ని ప్రాంగణాధికారికి ఫోన్ ద్వారా అక్కడి వాచ్ ఉమెన్ సుమలత తెలియజేశారు. వారి సూచనల మేరకు వేదాయపాళెం పోలీసులకు సుమలత ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేతుల పరిశుభ్రతతో వ్యాధులను అరికట్టొచ్చు



నెల్లూరు(అర్బన్): చేతుల పరిశుభ్రతతో పలు రకాల వ్యాధులను అరికట్టొచ్చని నారాయణ స్పెషాల్టీ ఆస్పత్రి జనరల్ ఫిజీషియన్ దొరసానమ్మ పేర్కొన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డేను పురస్కరించుకొని పొగతోటలోని నారాయణ స్పెషాల్టీ హాస్పిటల్ సమావేశ మందిరంలో పీఎంపీ సభ్యులు, రోగులు, వారి సహాయకులకు అవగాహన సదస్సును కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. హాస్పిటల్ ఏజీఎం చొకవర్ల భాస్కర్‌రెడ్డి, పీహెచ్‌పీ నేతలు శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, ప్రసాద్, రామదాస్, మాలిని, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు ఎంఈఓ - 1పై చర్యలకు డిమాండ్


డీఈఓకు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయుడు కొండారెడ్డిని దుర్భాషలాడిన వింజమూరు ఎంఈఓ - 1 రమేష్‌పై చర్యలు చేపట్టాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, పిచ్చిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ బాలాజీరావుకు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు శివకోటారెడ్డి, ఫెడరేషన్ బాధ్యులు నారాయణ, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, గురవయ్య, రియాజ్, ఖాదర్‌బాషా, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్టీఆర్ వైద్యసేవ'ను పునరుద్ధరించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్యసేవను నిలిపేయడంతో వైద్యమందక పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రైవేట్ ఆస్పత్రులకు పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు.

బ్లాక్‌లో యూరియా కొనుగోలు

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లేక నష్టపోయిన రైతులు
- రూరల్ మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆవేదన

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండలంలో యూరియాను బ్లాక్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అయితే కొందరికి ఇళ్ల వద్దే అందజేశారని సభ్యులు ఆరోపించారు. నగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో రూరల్ మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీఓ రమణమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను సక్రమంగా ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. దళారులు, మిల్లర్లు కనీస ధర కంటే తక్కువకు కొనుగోలు చేశారని, దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఎంపీటీసీలకు గౌరవ వేతనాన్ని కొన్ని నెలలుగా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాల నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఎంపీపీ విజయకుమార్, ఏఎంసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన అవసరం

నెల్లూరు(అర్బన్): గుండె ఆగిపోయినప్పుడు తిరిగి పనిచేసేందుకు నిర్వహించే సీపీఆర్‌పై అవగాహనను పెంపొందించుకోవాలని ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ మాధవి, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి పేర్కొన్నారు. సీపీఆర్‌పై నిర్వహిస్తున్న అవగాహన వారోత్సవాల్లో భాగంగా దర్గామిట్టలోని ప్రభుత్వాస్పత్రిలో వైద్య విద్యార్థులు, నర్సులు, పారామెడికల్ సిబ్బందికి ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నమూనా పద్ధతిలో చేసి చూపించారు. ఆపదలో ఉన్న వారికి అవసరమైనప్పుడు సీపీఆర్‌ను చేస్తామంటూ నర్సులు, వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి, అనస్థీషియన్ హెచ్ఓడీ శ్రీనివాసరావు, డాక్టర్ కళారాణి తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పరిశీలన

నెల్లూరు (టౌన్): జిల్లాలోని మోడల్ ఫౌండేషన్ స్కూళ్లలో విద్యా ప్రమాణాలను పెంపొందించాలని ప్రథమ్ సంస్థ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బుర్రా సునీత పేర్కొన్నారు. నారాయణరెడ్డిపేట, ఇందుకూరుపేట మండలంలోని మైపాడులో గల పాఠశాలలను బుధవారం ఆమె సందర్శించారు. ఎమ్మెఫ్ఎస్ – మోడల్ ఫౌండేషన్ స్కూళ్లు, అంగన్వాడీ కేంద్రాల్లో 1, 2వ తరగతుల పిల్లలకు అందిస్తున్న విద్యా ప్రమాణాలను తనిఖీ చేశారు. ఏఎంఓ సుధీర్‌బాబు, ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వినియోగదారుల హక్కుల మండలి కమిటీ నియామకం

నెల్లూరు (టౌన్): వినియోగదారుల హక్కుల మండలి జిల్లా నూతన కమిటీని బట్వాడిపాళెం సెంటర్‌లోని ఓ కన్వెన్షన్ హాల్లో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముజీర్ రోజ్దార్, వైస్ ప్రెసిడెంట్‌గా ప్రశాంతి, సెక్రటరీగా హరికృష్ణారెడ్డి, జాయింట్ సెక్రటరీగా విశ్వమైత్రి, ట్రెజరర్‌గా సమీనా మొఘల్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రద్యుమ్నరెడ్డి, మీడియా అడ్వైజర్‌గా విక్రమ్, మెంటార్లుగా భూలక్ష్మీదేవి, మన్నెం చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు.



'డీకేడబ్ల్యూ'లో ఎన్‌సీసీ ఎన్‌రోల్‌మెంట్

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విద్యార్థులకు ఫిజికల్ టెస్ట్, రాత పరీక్షలను ఎన్‌సీసీ సిబ్బంది రమణరావు, లోకేశ్ జరిపారు. వైస్ ప్రిన్సిపల్ రమణరావు, ఎన్‌సీసీ యూనిట్ కేర్ టేకర్ దివ్య తదితరులు పాల్గొన్నారు.



వర్షపు నీరు నిల్వ ఉండకూడదు

నెల్లూరు(బారకాసు): ఆత్మకూరు బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. ఆత్మకూరు బస్టాండు ఫ్లయ్‌ఓవర్, శెట్టిగుంట రోడ్డులోని చేపల మార్కెట్, మినీ బైపాస్, ముత్తుకూరు గేట్ సెంటర్ తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి అవసరమైన సహాయక చర్యలు చేపట్టేలా ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. అనంతరం రెవెన్యూ, పోస్టల్ కాలనీలు, కొత్తూరు, పొదలకూరు రోడ్డు ప్రాంతాల్లో నిర్మిస్తున్న రోడ్లు, కాలువలను పరిశీలించారు. ఇంజినీరింగ్ విభాగ ఎస్ఈ రామ్మోహన్ రావు, ఈఈ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సూచనలు చేస్తున్న నందన్

పౌష్టికాహారంతో క్షయ దూరం

నెల్లూరు(బృందావనం): తగిన పౌష్టికాహారం, మందులను తీసుకోవడం ద్వారా క్షయ వ్యాధిని నిర్మూలించొచ్చని డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. 600 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు కొండాయపాళెం రోడ్డులోని అబైడింగ్ హోప్ ట్రస్ట్ కార్యాలయంలో పౌష్టికాహార కిట్లను ట్రస్ట్ చైర్మన్ టైటస్ నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. జయప్రకాష్, సిస్టర్ రమ, మధు తదితరులు పాల్గొన్నారు.



పేదలకు అందని జీఎస్టీ ఫలాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తగ్గించిన జీఎస్టీ ఫలాలు పేదలకు ఏ మాత్రం అందడంలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. బాలాజీ నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. పార్టీ నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రమేష్